క్లుప్తంగా

యోగాతో ఆరోగ్య సమాజం



పందలపాకలో యోగా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బిక్కవోలు: దైనందిన జీవితంలో యోగా నిత్య కృత్యంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చని ద్వారంపూడి యువరాజారెడ్డి అన్నారు. బుధవారం పందలపాక సచివాలయం- 2 వద్ద అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందికి యోగా నేర్పించారు.

చిత్ర సందేశం



పర్యావరణ పరిరక్షణపై గీసిన చిత్రం

సీతానగరం: పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో విద్యార్థులు పలు చిత్రాలు గీసి ఔరా అనిపించారు. బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించారు. పదో తరగతి విద్యార్థులు సూరంపూడి వైష్ణవి, తెల్లాం వీర వెంకట శ్రీదేవిలు పర్యావరణ పరిరక్షణపై పలు చిత్రాలు గీసి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. వీరిని హైస్కూల్ హెచ్ఎమ్ కోలా సత్యనారాయణ, డ్రాయింగ్ టీచర్ మాచారమ్మ అభినందించారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక ఆసరా



కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్

సీతానగరం: మహిళలకు కుట్టు శిక్షణ ఆర్థిక ఆసరాగా ఉంటుందని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో కుట్టు శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకునే వారికి ముఖ ఆధారిత హాజరు ప్రాముఖ్యతను తెలిపారు. 75 శాతం హాజరు ఉంటేనే సర్టిఫికెట్‌తోపాటు కుట్టు మెషీన్ అందిస్తారని, తదుపరి రెండో విడతగా ఎంబ్రాయిడరీపై శిక్షణ ఉంటుందన్నారు. ఎంపీడీఓ ఎం.భారతి కుట్టు శిక్షణ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్ట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడి, కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు.

పుష్కర వనంలో యోగా సాధన



పుష్కర వనంలో యోగ సాధన చేస్తున్న ప్రజలు

రాజానగరం: లాలాచెరువు సమీపంలోని గోదావరి మహాపుష్కర వనంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కర వనానికి వచ్చే ఉద్యోగులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని, యోగ సాధనపై అవగాహన పెంచుకున్నారు. కానవరంలోని రాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగ కేంద్ర ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



రాజానగరం సాయిబాబా ఆలయంలో అఖండ బిల్వార్చన

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు సాయిబాబా ఉత్సవ విగ్రహానికి వివిధ రకాల పండ్ల రసాలతోపాటు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో సాయిబాబాకు అఖండ బిల్వార్చన జరిపారు. ముందుగా అదే ప్రాంగణంలో కొలువైన గణపతి, దత్తాత్రేయుడు, సరస్వతి మాత, అభయ ఆంజనేయస్వామి విగ్రహాలకు కూడా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

ఓటేసినందుకు వెన్నుపోటు



కోరుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

- ఇచ్చిన హామీల అమలు గాలికి
- ప్రజలను మోసం చేసిన చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

కోరుకొండ: నాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు.. నేడు కూటమి ప్రభుత్వంలో ఓటేసిన ప్రజలకు సీఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ నిలిచి కోరుకొండలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి రాజా సారథ్యం వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తే.. నేడు కూటమి ప్రభుత్వం విధ్వంసం, అక్రమ అరెస్టులు, రౌడీయిజానికి ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. గత ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజును పురస్కరించుకుని వెన్నుపోటు దినంగా నిర్వహిస్తున్నట్టు ఆయన అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తయారు చేయడంతోపాటు అమ్మఒడి పథకాన్ని వర్తింపజేస్తే.. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున తల్లికి వందనం ఇస్తామని చెప్పిన కూటమి నేతలు ఆ మాటలను నేటికీ అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగం ప్రోత్సాహంలో భాగంగా గతంలో రైతన్నలకు రూ.13,500లు రైతు భరోసాగా అందిస్తే.. చంద్రబాబు అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఒక్క పైసా కూడా విదిల్చలేదన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులను మోసగిస్తున్న చంద్రబాబు నిజ స్వరూపాన్ని ప్రజలు గుర్తించారన్నారు. ఇప్పుడు పాలకు-నీళ్లకు తేడాను తెలుసుకున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు ప్రజలు కూటమి నాయకులను కాలర్ పట్టుకుని నిలదీసే రోజులు వచ్చాయన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసి జగనన్న రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్న చంద్రబాబు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అప్పుల భారాన్ని రూ.1,51,604 కోట్లకు చేర్చిందని ఎద్దేవా చేశారు. ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించకుండా ఇంత భారీ అప్పులు చేయడం వెనుక అంతర్యం చెప్పకనే అర్థమవుతుందన్నారు. కాపు సామాజికవర్గానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మేలు చేస్తాడని ఆశిస్తే, కాపుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు కాళ్ల వద్ద ఉంచాడన్నారు. కాపులపై పాత కేసులు తిరగదోలడానికి, తుని కేసులు బనాయించి కాపులను వేధించాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం కుట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కు తెలియకుండా జరుగుతోందా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇసుక, మట్టి, గ్రావెల్‌లో మాఫియా దోపిడీకి హద్దుల్లేవన్నారు. క్రికెట్ బెట్టింగ్, పేకాట క్లబ్‌లు, రేవ్ పార్టీలు, డ్రగ్స్ మాఫియా తీవ్రమైందని అన్నారు. అధికారుల బదిలీల్లో పర్సంటేజీలు ఎక్కువయ్యాయని, డబ్బులివ్వక పోతే పోస్టింగులు ఇవ్వడం లేదన్నారు. తాను చెప్పిన రైస్‌మిల్లులకే ధాన్యాన్ని తోలాలని ఎమ్మెల్యే హుకుం జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఒత్తిడి కారణంగా సదరు వ్యవసాయ శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారన్నారు.

భారీ బైక్ ర్యాలీ, ప్రదర్శన

కోరుకొండలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కారు. స్థానిక జక్కంపూడి రాజా ఇంటి నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం రోడ్డు మీదుగా పాత మార్కెట్ సెంటర్, బస్టాండ్ సెంటర్, జాతీయ రహదారి గుండా కాపవరం శివుడి బొమ్మ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. కోరుకొండ జెడ్పీటీసీ క్రరి నాగేశ్వరరావు, రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్దవెంకన్న, కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి, సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద, కో-కన్వీనర్ గండి నానిబాబు, సీతానగరం కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో-కన్వీనర్ శ్రీహరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్కా రాంబాబు, నాయకులు క్రొవ్విడి సత్రాజు, తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, రాజానగరం మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, సీతానగరం మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, నాయకులు చల్లమల్ల సుజీరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండలో తహసీల్దార్ సుస్వాగతానికి డిమాండ్ల పత్రాన్ని అందిస్తున్న జక్కంపూడి రాజా



పార్టీ శ్రేణులతో ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బాబువన్నీ అడ్డగోలు హామీలే

- కూటమి పాలనతో విసిగిపోయిన జనం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



అనపర్తిలో వెన్నుపోటు దినం ర్యాలీలో జన సందోహం

అనపర్తి: ఎన్నికల్లో అడ్డగోలు హామీలతో ప్రజలను నమ్మించిన చంద్రబాబు, తీరా అధికారం చేతికి వచ్చాక మోసం చేశాడని, కూటమి ఏడాది పాలనతో ప్రజలంతా విసుగుపోయారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దగా చేసిన ప్రభుత్వం తీరుకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని అనపర్తిలో ఆయన అధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ చేశారు. దీనికి డాక్టర్ సూర్యనారాయణరెడ్డితో పాటు ముఖ్య అతిథిగా అనపర్తి నియోజకవర్గ పరిశీలకుడు, రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు హాజరయ్యారు. ఎండ మండుతున్నా వేలాది మంది తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం చుట్టూ ఉన్న వీధులన్నీ జనంతో నిండిపోయాయి. ఉదయం పది గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి భారీ జన సందోహంతో ప్రారంభించిన ర్యాలీ రైల్వే స్టేషన్ రోడ్డు, దేవీచౌక్ మీదుగా సాగింది. నల్ల కాలువ వంతెన వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. ప్రజల సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పేదలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేశారన్నారు. వాటిని ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం తొలగిస్తుందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించి కీలకమైన వలంటీర్ వ్యవస్థ, ఇంటింటికి రేషన్, ఫ్యామిలీ డాక్టర్ వంటి ఎన్నో పథకాలను పూర్తిగా రద్దు చేశారని ఆరోపించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతు స్వల్ప వ్యవధిలోనే ఎంతో అపఖ్యాతిని మూటకట్టుకున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో సామాన్యులపై చేస్తున్న దాష్టీకాలకు ఇంత తక్కువ వ్యవధిలోనే తిరుగుబాటు ప్రారంభమైందని నిరసన ర్యాలీకి వచ్చిన జనాన్ని చూస్తే అవగతమవుతుందన్నారు. పార్టీ శ్రేణులంతా సంఘటితంగా ఉండి అధికార పార్టీ అరాచకాలను ఎదుర్కోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందని అన్నారు.

చెవిలో పువ్వులతో నిరసన

అనపర్తి వైఎస్సార్ సీపీ సారథ్యంలో జరిగిన వెన్నుపోటు నిరసన ర్యాలీలో జనం ఉత్సాహంగా పాల్గొన్నారు. హామీలిచ్చి మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని దుయ్యబడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. యువకులు చెవిలో పువ్వులు పెట్టుకుని దేవీచౌక్ సెంటర్‌లో మండుటెండలో రోడ్డుపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి, కాపవరం, వేండ్ర, కొంకుదురు, ఇల్లపల్లి సర్పంచులు వారా కుమారి, సత్యంశెట్టి వెంకటరమణ, కోసూరి వాసు, సత్తి వీరమణి, లొల్ల భద్రం, అనపర్తి పార్టీ కన్వీనర్ నల్లమిల్లి బాలమురళీకృష్ణారెడ్డి, పెదపూడి జెడ్పీటీసీ, ఎంపీపీలు పేపకాయల వెంకటలక్ష్మి, కేతా తులసి, బిక్కవోలు మాజీ ఎంపీపీ బుద్దాల కన్నారావు, ఎంపీటీసీ సభ్యులు సమ్మంగి దుర్గాప్రసాద్, మారెళ్ల భీష్ముడు, మేడపాటి ఆనందరెడ్డి, మత్సా వీరభద్రం, సుందరపల్లి సుధాకర్, ఏడుకొండలు, బండారు శ్రీను, సత్తి కనకారెడ్డి, సబ్బెళ్ల వెంకటరెడ్డి, అనపర్తి వైస్ ఎంపీపీ కర్రి దాసు, నియోజకవర్గ వీవర్స్ సెల్ అధ్యక్షులు పప్పు సింహాచలం, జిల్లా వీవర్స్ సెల్ అధ్యక్షుడు పెనుగొండ శ్రీను, మండల రైతు విభాగం ఉపాధ్యక్షుడు సత్తి గంగిరెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి తాడి సూరారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి మండ రాజారెడ్డి, పార్టీ జిల్లా పంచాయతీ విభాగం అధ్యక్షుడు పాలాటి నాగేశ్వరరావు, రంగంపేట బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు మంగిన రాంబాబు, సంపర మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు అద్దంకి ముక్తేశ్వరరావు, పాలమూరు, కుతుకులూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, సబ్బెళ్ల నాగిరెడ్డి, పీరారామచంద్రాపురం కోనాల సాయిరామారెడ్డి, రంగంపేట, బిక్కవోలు, పెదపూడి మండలాల పార్టీ కన్వీనర్‌లు నల్లా శ్రీను, పోతుల ప్రసాదరెడ్డి, గుత్తుల వెంకటరమణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు సాంబత్తుల చంటి, బీసీ సెల్ నాయకులు కొండేటి భీమేశ్వరస్వామి, గుబ్బల లాజర్‌బాబు, పందలపాక విద్యా కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి అక్రమ రవాణా



కూనవరం పాతూరి వారి చెరువులో మట్టి తవ్వకాలు

సీతానగరం: గ్రామ అవసరాలకు పంచాయతీ తీర్మానంతో చెరువు నుంచి మట్టిని తీసుకుని ప్రజలు ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. దానిని ఆసరాగా చేసుకుని కొంతమంది జేబులు నింపుకొంటున్నారు. ట్రక్ మట్టికి రూ.1,200 వసూళ్లు చేస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కూనవరం పంచాయతీలో గ్రామ అవసరాలకు పాతూరివారి చెరువు నుంచి మట్టి తీసుకుని పంచాయతీ ప్రజలు, రైతులు ఉపయోగించుకోవచ్చని తీర్మానం చేశారు. అయితే చెరువులో మాత్రం సుమారు 50 ట్రాక్టర్లు, రెండు జేసీబీలు, పొక్లెయిన్‌లతో మట్టిని ట్రాక్టర్‌లపై ఎగుమతి చేసి, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కూనవరానికి తీసుకెళ్లి రూ.1,200కు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్, పొక్లెయిన్‌కు కేవలం రూ.500 అవుతుందని, కానీ అధిక ధర వసూళ్లు చేస్తున్నారని పలువురు అంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.సుధాకర్‌ను వివరణ కోరగా గ్రామ అవసరాలకు చెరువు మట్టి ఉపయోగించుకునే విధంగా పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. అయితే అధిక ధరతో అమ్మకాలు జరపరాదని, ఇతర గ్రామాలకు మట్టిని తరలించరాదన్నారు. ఇతర గ్రామాలకు మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం లేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

గుట్టుగా ఇసుక తవ్వకాలు



మంగళవారం రాత్రి మునికూడలి ర్యాంపులో ఇసుక లారీలు

సీతానగరం: మునికూడలి ర్యాంపు నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు మంగళవారం రాత్రి యథేచ్ఛగా జరిగాయి. ర్యాంపులను అక్టోబర్ వరకు నిలిపివేస్తున్నట్లు, స్టాక్ పాయింట్‌లకు ఇసుక డంపింగ్ చేయరాదని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ప్రక్కిల్లంక భూముల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరిపి లారీలపై మునికూడలి ర్యాంపు నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుక డంపింగ్ చేస్తున్నారు. గోదావరి నదీ గర్భంలో మూడు భారీ పొక్లెయిన్‌లతో ఇసుక తవ్వకాలు జరిపారు. దీనిపై తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా తక్షణమే ర్యాంపును నిలిపివేస్తామని తెలిపారు.

జీతాలు లేకుంటే ఎలా?



విధులు నిర్వర్తిస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

రాజానగరం: ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగులందరికీ జీతాలు అందుతున్నాయి. కానీ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మాత్రం కొన్నిచోట్ల జీతాలు మంజూరు కాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ ఆఫీసర్ (డీడీఓ) హోదా ఉండటంతో ఆయా సచివాలయాల సిబ్బంది జీతాలకు సంబంధించిన ఫైల్‌ని వారే ప్రిపేర్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉన్నతాధికారులు ఆదేశించిన పనులు సకాలంలో జరగని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది జీతాలను పెండింగ్‌లో పెట్టడం ఈ సమస్యకు ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఆదేశించిన పనులు పూర్తి చేస్తేనే జీతాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హుకుం జారీ చేయడంతో ప్రతినెలా వారి జీతాలు సకాలంలో అందక ఆర్థికంగా నలిగిపోతున్నారు. రాధేయపాలెంలో ఇదే విషయమై ఆ గ్రామ సచివాలయ సిబ్బంది డీఎల్‌పీఓ వీణాదేవికి ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. ఈ విధమైన సమస్యను ఎదుర్కొంటున్న గ్రామ సచివాలయాల సిబ్బంది కూడా తమ ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. మండలంలో 33 గ్రామ సచివాలయాలలో 298 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా రెగ్యులర్ ఉద్యోగులే కావడంతో వచ్చే జీతాలను ఆధారంగా చేసుకుని పాల బిల్లులు, కరెంటు చార్జీలు, పిల్లల స్కూలు ఫీజులు, ఈఎంఐలు ఇలా అనేకం నెలా వారీ ఖర్చులు కూడా నిర్దేశింపబడి ఉంటాయి. ఈ క్రమంలో సకాలంలో జీతాలు అందకపోతే ఆయా ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ జేఏ ఝూన్సీని వివరణ కోరగా కొన్నిచోట్ల ఇటువంటి సమస్య ఉన్న మాట వాస్తవమేనన్నారు. నెలవారీ చెల్లించాల్సిన జీతాలను ఏవిధంగానూ ఆపడం సరికాదన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు.

బెంచ్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన ఇనుగంటివారి పేటకు చెందిన రాజు

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన యల్లమెల్లి రాజు బెంచ్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించారు. గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకూ ఒంగోలులోని డాక్టర్ ఆనంద్ మినీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాజు పాల్గొన్నారు. బెంచ్ లిఫ్టింగ్‌లో 95 కిలోల్లో బంగారు పతకం సాధించారు. పవర్ లిఫ్టింగ్‌లో మూడు విభాగాల్లో 475 కిలోలు ఎత్తి కాంస్య పతకం పొందారు. రాజమహేంద్రవరంలోని భారతీయ వ్యాయామ కళాశాలలో ఆయన శిక్షణ పొందారు. రాజును, కోచ్ లక్ష్మీనారాయణను వ్యాయామ కళాశాల అధిపతి వై.రవికుమార్, ఇనుగంటివారిపేట సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ-2 సత్య మదన్‌బాబు, గ్రామస్తులు అభినందించారు

రిసోర్స్ పర్సన్లకు శిక్షణ

కంబాలచెరువు: స్థానిక నన్నయ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో జరుగుతున్న జిల్లా రిసోర్స్ పర్సన్ల శిక్షణ తరగతులను బుధవారం టీచర్స్ ట్రైనింగ్ రాష్ట్ర పరిశీలకుడు సురేష్‌కుమార్ పరిశీలించారు. ప్రభుత్వం విద్యాశాఖలో కొత్తగా అమలు చేస్తున్న అకాడమిక్ క్యాలెండర్, సెల్ఫ్ అసెస్‌మెంట్ బుక్‌లెట్, టీచర్ హ్యాండ్ బుక్, లీప్ యాప్ తదితర అంశాలపై శిక్షణ పొంది, ఈ నెల 8, 9, 10 తేదీలలో డివిజన్ వారీగా జరిగే ఉపాధ్యాయులకు వీరు ఇవ్వనున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ



రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం నగరంలో రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పట్ల అవమానకరంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి హిందూ రాజ్యాంగాన్ని తేవాలని బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలను వివరించి వారిలో చైతన్యం తేవడానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు భారతరత్న ఇవ్వాలి



నగరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర



ధవళేశ్వరంలో బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు

ధవళేశ్వరం: సంగీత ప్రపంచానికి విశేష సేవలందించిన దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి భారతరత్న ఇవ్వాలని గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు కోరారు. రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధవళేశ్వరంలోని ఘంటసాల విగ్రహం సమీపంలో శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు జీవీ రమణ మాట్లాడుతూ బాలు తెలుగు వారి ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. ఉపాధ్యక్షుడు గ్రంధి జగన్నాథం మాట్లాడుతూ పదహారు భాషల్లో ఏభై వేల పాటలు పాడిన ఏకైక గాయకుడు బాలు అని కొనియాడారు. కోశాధికారి సురపురెడ్డి తాతారావు, మున్సిపల్ డీఈ ఇ.మధర్యా ఆలీ, రాయుడు చంద్రశేఖర్, బర్రి సుబ్రహ్మణ్యం, పుసులూరి శేషు కుమార్, ముడెడ్ల రమేష్, గాదిరాజు రామరాజు, మడిచేర్ల మహాలక్ష్మి, దాసరి సాయిబాబు పాల్గొన్నారు.

బాలుతో అనుబంధం మరువలేనిది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో అనుబంధం మరువలేనిదని నట గాయకుడు జిత్ మోహన్‌మిత్ర అన్నారు. ఎస్పీ బాలు జయంతి సందర్భంగా జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్ మిత్ర కళావేదికపై సంగీత విభావరి నిర్వహించారు. బాలు పాడిన చిత్రాల నుంచి గీతాలను ఎంపిక చేసుకుని సింగర్ వంకా బాలకృష్ణ పర్యవేక్షణలో గాయని గాయకులు పాటలు పాడి అలరించారు. జిత్ మోహన్‌మిత్ర మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ గాయకుల్లో బాలు ఒకరన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బి.సీతారామారావును కళా సేవా రత్న పురస్కారంతో సత్కరించారు. ముద్రగడ ఏసుబాబు, పోస్టల్ ప్రసాద్, జల్లి శివప్రసాద్ , వీపీఎస్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి



నవధాన్యాల సాగు గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త నాయుడు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీఎస్‌టీ నాయుడు అన్నారు. రాజవోలు గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీఏఆర్, వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు డ్రోన్ వినియోగం, నవ ధాన్యాల సాగు, మట్టిలో ఉన్న పోషక విలువలను గుర్తించి తద్వారా ఎరువుల వినియోగం, పంటల ఎంపిక తదితర విషయాలపై శాస్త్రవేత్తలు వివరించారు. పీఎం కిసాన్, ఫసల్ బీమా, ఆర్కేవీవై, ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. డ్రోన్ల వినియోగం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో ఎరువులు, పురుగు మందులు సమర్ధవంతంగా పిచికారీ చేసే విధానాన్ని ఇఫ్కో, కోరమండల్ సాంకేతిక సిబ్బంది తెలిపారు. అనంతరం రాజవోలు గ్రామంలో నవధాన్యాలు సాగు చేసిన పొలాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్లు సరళ, శిరీషా, వ్యవసాయ అధికారి భీమరాజు, ఆత్మ బీటీఎం రాజశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారులు పీటర్ ప్రభుదర్శన్, వేణు మాధవ రావు, వీఏఏలు దుర్గబాబు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.